ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శుక్రవారం 13 సెప్టెంబరు 2024



నిమజ్జనం కారాదు విషాదం

● వినాయకుడి శోభాయాత్రలో జాగ్రత్తలు తప్పనిసరి

7



తెగుళ్ల తంటా.. కన్నీళ్లు కంట

● వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటలు
● తెగుళ్లతో నల్లబారుతున్న కాయలు
● ఆందోళనలో అన్నదాతలు


7

పులిబొమ్మ..కోతులు రావమ్మా..

● రైతు వినూత్న ఆలోచన

కోతులు, అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు.. కొందరు రైతులు తమకు తోచిన విధంగా పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఆ కోవలోనే మద్దూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతు మెతుకు శివారెడ్డి వినూత్న ఆలోచన చేశాడు. పత్తిపంటను కోతుల నుంచి కాపాడుకోవడానికి పంట మధ్యలో ఓ తాడుకు పులిబొమ్మను ఏర్పాటు చేశాడు. గాలికి ఆ బొమ్మ కదులుతుండడంతో కోతులు బెదిరిపోయి అటుగా రావడం లేదని రైతు చెబుతున్నాడు.

- మద్దూరు, సెప్టెంబరు 12



గణపయ్య చెంతకే గంగమ్మ

● జలాభిషేకంతో వినాయక నిమజ్జనం
● 108 కలశాలతో శోభాయాత్ర
● నిమజ్జనానంతరం మట్టి ప్రసాదం వితరణ



మట్టి గణనాథుడు

సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 12: వినాయక ప్రతిష్ఠ మొదలుకుని నిమజ్జనం వరకు అంతా ప్రకృతితో సంబంధం ఉంటుంది. ప్రకృతిలో మమేకమైన మనకు అనుబంధముంటుంది. కానీ కాలక్రమేణా పండుగ పరమార్థాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారు!! అయితే సిద్దిపేటలోని గణేష్‌నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి చారిటబుల్ ట్రస్ట్, శ్రీప్రసన్నాంజనేయ స్వామి మహిళా గోష్ఠి సంయుక్తంగా అర్చకులు చిలకమర్రి వెంకటరమణచార్యుల దిశానిర్దేశంలో వినూత్న రీతిలో పండుగ పరమార్థం తెలిసేలా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నారు. నవరాత్రులు పూజలందుకున్న గణపయ్య గంగమ్మ ఒడికి చేరుతాడు. కానీ ఇక్కడ మాత్రం నవరాత్రులు పూర్తయిన రోజున పట్టణ పురవీధుల్లో 108 కలశాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహిస్తారు. అనంతరం వినాయకుడిని ప్రతిష్ఠించిన స్థానంలోనే 108 కలశాలతో స్వామివారి ప్రతిమపై నీటితో అభిషేకం చేసి నిమజ్జనం చేయనున్నారు. ఆదిశక్తికి ప్రతిరూపం మహిళలు కాబట్టి వారి చేతనే నిమజ్జన పూజా క్రతువు చేపడుతున్నట్లు అర్చకులు వెంకట రమణాచార్యులు తెలిపారు. నిమజ్జనం అనంతరం ప్రతిమ నుంచి వచ్చిన మట్టిని పట్టణవాసులకు, భక్తులకు ప్రసాదంగా ఇవ్వనున్నారు. ఆ మట్టికి మరికొంత మట్టి చేర్చి తులసి మొక్కను ఏర్పాటు చేసుకోవచ్చని చెబుతున్నారు. సంప్రదాయాలను కాపాడుతూనే ప్రకృతిహితంగా పండుగ చేసుకోవాలని ప్రసన్నాంజనేయ స్వామి మహిళా గోష్ఠి సభ్యురాలు ఉప్పలంచి కవిత సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ప్రసన్నాంజనేయ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు మాంకాల చంద్రమౌళి కోరారు.

సహస్ర దీపాలంకరణ

గణనాథుడికి గురువారం సహస్ర దీపాలంకరణ చేశారు. అంతకుముందు వినాయకుడు, శివుడి ప్రతిరూపాలను రంగులతో అందంగా తీర్చిదిద్దారు.



సహస్ర దీపాలంకరణలో మహిళలు



కాలుష్యకారకంగా మారిన దుబ్బాక ఏదుల్లా చెరువు

చెరువులో చనిపోయిన కోళ్లు



చెరువు కట్టపై చెత్తసంచులు

నాడు మంచినీళ్ల చెరువు.. నేడు కాలుష్యకాసారం

● చెత్తతో నిండుతున్న ఏదుల్లచెరువు
● చనిపోయిన కోళ్లు, పాడైన కోడిగుడ్లతో దుర్గంధం
● చేపలు పట్టాలంటేనే జంకుతున్న మత్స్యకారులు
● చెరువు ఉనికిని కాపాడాలని రైతుల విన్నపం

దుబ్బాక, సెప్టెంబరు 12 : మంచినీళ్ల బోర్లు, బావులు లేని సమయంలో ఆ చెరువే తాగునీటికి ఆదరవు. దొరల కాలంలో బగ్గీలు, ఎడ్లబండ్ల మీద ఇత్తడి అండలు పెట్టి దుబ్బాకకు తాగడానికి నీళ్ల ఆ చెరువులో నుంచే తెచ్చేవారు. దుబ్బాకనే కాకుండా, దుబ్బాక సంస్థానంలోని దొరలంతా ఇదే చెరువు చేపలంటే ఇష్టపడుతారనే నానుడి ఉండేది. చిన్నపాటి వర్షంతోనే నిండే చెరువు స్వచ్ఛమైన వరదనీటితోనే నిండేది. అయితే.. స్వచ్ఛమైన దుబ్బాక ఏదుల్ల చెరువు ఇప్పుడు కాలుష్యకాసారంగా మారుతుంది. అధికారుల నిర్లక్ష్యం మూలంగా మంచినీటి చెరువు దుర్గంధంగా, చెత్తాచెదారంతో నిండిపోతుంది. దుబ్బాక నుంచి వెళ్లే మురుగు కాలువను కూడా ఇదే చెరువుకు ఇటీవల అనుసంధానం చేయడంతో కలువపూలతో అందమైన చెరువుగా పేరున్న ఏదుల్ల చెరువు ఇప్పుడు కంపు వెదజల్లుతుంది.

సుమారు 22 ఎకరాల విస్తీర్ణం, 45 ఎకరాల ఆయకట్టుతో రైతులకు ఉపయోగపడుతుంది. గతేడాది దుబ్బాక పట్టణం నుంచి రామసముద్రం వైపు వెళ్లే మురుగుకాలువను ఇటువైపు మళ్లించి కాలుష్య కారకంగా మార్చారు. దీనికి తోడు చెరువు కట్టపైన, నీటిలో దుబ్బాక నుంచి సేకరించే చెత్తను, చనిపోయిన కోళ్లను వేస్తున్నారు. కొంతమంది కోళ్ల వ్యాపారులు ఇందులో చనిపోయిన కోళ్లను సంచుల్లో మూటకట్టి పడేస్తున్నారు. చెడిపోయిన కోడిగుడ్ల ట్రేలను, దుర్గంధం వెదజల్లే చెత్తను సంచుల్లో నింపుకుని వచ్చి ఇందులో పడేస్తున్నారు. దీంతో ఇదే కట్టమీదనుంచి వెళ్లే దుబ్బాక, దుంపలపల్లి వాహనదారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చుట్టూ ఉన్న ఆయకట్టు రైతులు కూడా అవస్థలు పడుతున్నారు. చేపలు పట్టే గంగపుత్రులు కూడా ఈ చెరువులో చేపలు పట్టాలంటే ఇబ్బందిగా మారింది. గతంలో ఈ చెరువులోని చేపలు రుచికరంగా ఉండేవని చాలా మంది ఎంతగానో ఇష్టపడేవారు. అయితే ఇప్పుడు ఆ నీటిని చూసి చేపలు తినాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే నీటిపారుదలశాఖ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు పునర్వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



చెరువు కట్టపై కోళ్ల మృతదేహాలు, చెత్తాచెదారం

ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించాలి

● చెరువుల వద్ద పటిష్ట బందోబస్తు
● సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు
● సీపీ డాక్టర్ అనురాధ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 12: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వినాయక శోభాయాత్ర నిర్వహించాలని సీపీ డాక్టర్ అనురాధ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతీ చెరువు, కుంటల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శోభాయాత్ర వెళ్లే రూటును, నిమజ్జనం జరిగే చెరువులను కుంటలను తప్పకుండా సందర్శించాలని అధికారులు సూచించారు. ప్రజలెవరూ సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మకూడదని సూచించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని చెప్పారు. వినాయక శోభాయాత్రలో డీజేలను అనుమతించొద్దన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీద్‌ల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున ఇప్పటికే ఐడెంటిఫై చేసిన కేసులలో కక్షిదారులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి ఎక్కువ కేసులను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని ఆటోడ్రైవర్లకు అందరికీ అభయ యాప్, మై ఆటో సేఫ్ గురించి అవగాహన కల్పించాలని సిద్దిపేట గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తం రెడ్డి, సతీష్, రవీందర్, యాదగిరి, శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, కమలాకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్ కాంపిటీషన్

● ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7

ఆ మండలాలను కరీంనగర్‌లో కలపాలి

● కోహెడలో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో నిరసన
● నాటి హామీలను అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి

కోహెడ, సెప్టెంబరు 12: కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు కరీంనగర్ జిల్లా సాధన సమితి సభ్యులు, అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. గతంలో జిల్లా సాధన సమితి, అఖిల పక్షం ఆధ్వర్యంలో రిలే దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టారు. అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి ఆందోళనకు మద్దతు ఇచ్చారు. అయితే గురువారం సామాజిక కార్యకర్త రాజు ఆధ్వర్యంలో కోహెడ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వద్ద బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, బీసీ సంఘం, వివిధ కుల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో మరోసారి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కుల గణన చేసేలోపు మండలాలను కరీంనగర్‌లో కలపాలన్నారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ రాకముందే మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యత తీసుకుని ఈ నాలుగు మండలాలను కరీంనగర్‌లో కలిపి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో ఈ మండలాలను కలపడం వల్ల కుల సంఘాల రిజిస్ట్రేషన్, ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టుకు వెళ్లాలన్న సంగారెడ్డి, మెదక్‌కు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగాల్లో ఈ మండలాలకు చెందిన విద్యార్థులకు నాన్‌లోకల్ కింద రావడం వల్ల ఉద్యోగాలు రావడంలేదన్నారు. కరీంనగర్‌లో కలిపిన తర్వాతనే మండలాల్లో మంత్రి పర్యటనకు రావాలని అన్నారు. మంత్రి మద్దతు తెలిపి 10 నెలలు గడవడంతో ఇచ్చిన మాటను గుర్తుచేయడానికే ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. నిరసన తెలిపిన వారిలో అఖిలపక్ష నాయకులు ఖమ్మం వెంకటేశం, గవ్వ వంశిధర్‌రెడ్డి, ముంజ గోపి, పిడిశెట్టి రాజు, మంద మల్లేశం, గోవిందు సురేష్, కొండబత్తిని సతీష్, ముంజ శ్రీనివాస్ గౌడ్, జేరుపోతుల మల్లేశం, పొన్నాల సంపత్, షేక్ అలియాన్, సయ్యద్ గోరిమియ్య, శ్రావనపల్లి శాంతికుమార్, దానబోయిన శరత్‌కుమార్ పాల్గొన్నారు.



కోహెడలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు



దుబ్బాకలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

'హైడ్రా' పేరుతో ప్రభుత్వం హైడ్రామా

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

8

మహిళల ఉపాధికి చేయూత

● సోనాలీ కోళ్ల పెంపకానికి ప్రణాళిక సిద్ధం
● 172 మంది పాడి లబ్ధిదారుల ఎంపిక
● పాడిగేదెకు రూ.93 వేల చేయూత
● ఉపాధి కల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన

8

'డబుల్' ఇళ్లపై సర్కారు దృష్టి

● నివాసముంటున్న వారితో ఆర్డీవోల సమావేశం
● ఇళ్లు, ప్లాట్ ఇచ్చిన వారు ఖాళీ చేయాలని సూచన
● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ ఇళ్లపై మరోసారి సర్వే నిర్వహించే అవకాశం?

గజ్వేల్, సెప్టెంబరు 12: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, సిద్దిపేట ఆర్డీవో సదానందం ప్రస్తుతం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో సమావేశమయ్యారు. కాలనీలో నివాసం ఉంటున్న ఒక్కొక్కరిని పిలిచి వారికి రావాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీ, ప్లాటు ఇతరత్రా సదుపాయాలపై ఆరా తీశారు. ప్లాటు, ఇల్లు పొందిన నిర్వాసితులు తక్షణమే డబుల్ ఇళ్లను ఖాళీ చేయాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందించేందుకు మల్లన్న సాగర్ భూనిర్వాసితులు సహకరించాలన్నారు.

600 ఇళ్లలో నిర్వాసితులు

గజ్వేల్‌లోని సంగాపూర్‌లో జీ ప్లస్ వన్ పద్ధతిలో నిర్మించిన 600 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు తాత్కాలిక నివాసాన్ని కల్పించారు. 2020-21లో రిజర్వాయర్ ప్రారంభం సమయంలో గజ్వేల్‌లోని మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇళ్లు పూర్తి చేయకపోవడం, పలువురు డబుల్ బెడ్‌రూం ఇళ్లు వద్దని ప్లాట్ కేటాయిస్తే తమకు నచ్చినట్టు ఇల్లు కట్టుకుంటామని చెప్పడంతో తాత్కాలిక నివాసంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. తర్వాత ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం, ఇళ్లను అప్పగించడంతో కొందరు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఖాళీ చేశారు. ఇంకా 598 మంది ఖాళీ చేయలేదు. మరో పక్క ఈ ఇళ్ల కోసం ప్రభుత్వం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసింది. కానీ ఇళ్లలో నిర్వాసితులు ఉండడంతో లబ్ధిదారులకు అప్పగించలేదు. దీంతో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు నిత్యం మల్లన్నసాగర్ నిర్వాసితులతో గొడవకు దిగుతున్నారు. ఈ క్రమంలో పలుమార్లు అధికారులు నిర్వాసితులను, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులను బుజ్జగించారు. తాజాగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్డీవో, అధికారులు విచారణ చేపట్టారు. ఇల్లు లేదా ప్లాట్ పొందిన లబ్ధిదారులు వెంటనే తాత్కాలిక నివాసాన్ని ఖాళీ చేసి సొంత ఇళ్లలోకి వెళ్లాలని కోరారు. దాదాపు 391 మంది భూ నిర్వాసితులకు సంబంధించి ప్యాకేజీ, పరిహారం, ఇల్లు, ప్లాటు కేటాయించడం పూర్తయిందని చిన్నపాటి పరిహారాల కోసం ఇళ్లను ఖాళీ చేయకపోవడం సరికాదన్నారు.



గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవోలు బన్సీలాల్, సదానందం

పూర్తిస్థాయి, ప్యాకేజీ పరిహారం అందించాలి

మల్లన్నసాగర్ నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం, ప్యాకేజీ, ఇల్లు, ప్లాట్లుఅందజేయాలని అధికారులను భూనిర్వాసితులు కోరారు. తమకు రావాల్సిన పరిహారం ప్యాకేజీ ఇతరత్రా అందజేస్తే ఇళ్లను ఖాళీ చేస్తామని చెప్పారు. తాము ఇళ్లను నిర్మించుకుంటున్నామని పూర్తయిన వెంటనే ఖాళీ చేస్తామని మరికొందరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తమ ఇళ్లు, ప్లాట్ల సంగతి తేల్చాలని ఇంకొందరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇళ్లను పరిహారాలను ప్యాకేజీని అందజేశారని అన్ని అర్హతలు ఉన్న తమకు ప్యాకేజీ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఇంకొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోమారు సర్వే..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తాత్కాలికంగా నివాసం ఉంటున్న మల్లన్నసాగర్ భూనిర్వాసితుల ఇళ్లను మరోసారి సర్వే చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు గజ్వేల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అధికారులు పలు ఇళ్లను గుర్తించారు. మిగిలిన ఇళ్ల విషయమై త్వరలో మరోసారి సర్వే నిర్వహించి ప్యాకేజీ, పరిహారం, ఇల్లు కేటాయించిన వారిని గుర్తించనున్నారు. మల్లన్నసాగర్ భూనిర్వాసితులు తమ ఇళ్లను ఖాళీ చేస్తే డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించే అవకాశం ఉంది.

బల్వాంతాపూర్‌లో 'డబుల్' లొల్లి

● జాబితా లేకుండానే రెండేళ్ల క్రితం గృహప్రవేశాలు
● అనర్హులను ఖాళీ చేయించాలంటూ కలెక్టర్‌కు గ్రామస్థుల వినతి
● రెవెన్యూ అధికారుల విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

దుబ్బాక, సెప్టెంబరు12: దుబ్బాక మండలం బల్వాంతాపూర్‌లోని డబుల్ బెడ్‌రూం కాలనీలో గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. రెండేళ్ల క్రితం గ్రామంలో నిర్మించిన 20 డబుల్ బెడ్‌రూంల జాబితా వెలువడకముందే కొందరు అందులో నివాసం ఉంటున్నారు. వారిలో అర్హులు, అనర్హులున్నారు. ఆయా ఇళ్లను మరమ్మతులు కూడా చేసుకుని ఉంటున్నారు. రెండు రోజులుగా తిరిగి డబుల్ ఇళ్ల వ్యవహారం వివాదంగా మారింది. అనర్హులు అందులో ఉంటున్నారని రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. కలెక్టర్‌కు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పొలం వద్ద మంచె వేస్తుండగా ఘటన



దాచారం దీపక్ (ఫైల్)

వర్గల్, సెప్టెంబరు 12 : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం వర్గల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన దాచారం కృష్ణ, ఇందిర దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడైన దాచారం దీపక్(20) ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. మొక్కజొన్న పంట చేతికి రావడంతో దానిని కాపాడుకునేందుకు మంచె ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులతో కలిసి గురువారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. మంచె ఏర్పాటు చేయడం కోసం కర్రలు తీసుకుని వస్తుండగా కర్రలు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీపక్‌ను చికిత్స కోసం కుటుంబ సభ్యులు ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్ తీగలు కిందకు ఉండటంతోనే ప్రమాదం చోటుచేసుకుందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దీపక్ మృతి పట్ల వేలూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకున్నది.

బొల్లారంలో ఎండు గంజాయి పట్టివేత

జిన్నారం, సెప్టెంబరు 12: జిన్నారం మండలం బొల్లారంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతలో బొల్లారం మల్లన్న బస్తీలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు యువకులను చెక్ చేయగా, వారి వద్ద 750 గ్రాముల ఎండు గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిల్లలతో మొబైల్ ఫోన్ల చోరీ

● కారు, 17 సెల్‌ఫోన్లు, రూ.5వేల నగదు స్వాధీనం

తూప్రాన్, సెప్టెంబరు 12 : పిల్లలతో మొబైల్ ఫోన్ల చోరీలు చేయిస్తారు. చోరీలు చేసిన ముఠా నాయకుడికి అందజేస్తారు. చోరీ మొబైల్ ఫోన్లు అమ్ముకుని డబ్బు తీసుకుంటారు. గురువారం తూప్రాన్‌లో పోలీసుల తనిఖీల్లో సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యులు పట్టుబడ్డారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా షిఫ్ట్ డిజైర్ కారులో నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా 17 మొబైల్ ఫోన్లు చోరీ చేసినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, రూ.5వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన ఈడిగా రవికుమార్ (27), కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన సత్పాడి అరవింద్ (20)తో పాటు 13ఏళ్లలోపు ఇద్దరు చిన్నారులను పట్టుకున్నారు. ముఠా నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు ప్రభు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు. పట్టుకున్న నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

అప్పుల బాధ భరించలేక డ్యాన్స్ మాస్టర్ అదృశ్యం

చనిపోతున్నాను.. కుటుంబాన్ని ఆదుకో అని మిత్రుడికి వాట్సాప్ మెసేజ్



అదృశ్యమైన డాన్సు మాస్టర్ నరేష్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12 : అప్పు చేసి ఓ ప్లాట్ కొనుగోలు చేశాడు... అప్పు ఇచ్చిన వారి నుంచి తిరిగి డబ్బు ఇవ్వాలని ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపం చెందాడు... తాను చనిపోతున్నానని తన స్నేహితుడికి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించి కనిపించకుండా పోయాడో డ్యాన్స్ మాస్టర్. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో గురువారం చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... సంగారెడ్డి పట్టణానికి చెందిన జిల్లా నరేష్(30) పోతిరెడ్డిపల్లిలో ఎన్ఎస్‌డీపీ డ్యాన్స్ స్కూల్ ఏర్పాటు చేసి పిల్లలకు డ్యాన్స్ నేర్పిస్తుంటాడు. అయితే ఇటీవల పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఓ ప్లాట్ కొనుగోలు నిమిత్తం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి తిరిగి ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి రావడంతో భరించలేక, మనస్తాపానికి గురై గురువారం ఉదయం 9.30 గంటలకు తన మోటార్ సైకిల్ తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం 6.35 గంటల సమయంలో తన స్నేహితుడైన బాణాల శ్రీనివాస్‌కు 'ఐ మిస్ యూ.. నేను చనిపోతున్నాను.. నా కుటుంబాన్ని ఆదుకో' అని కోరుతూ వాట్సాప్ మెసేజ్ పంపించాడు. ఆ తర్వాత తన ఫోన్‌ను స్విచాఫ్ చేశాడు. ఈ విషయాన్ని నరేష్ భార్య జిల్లా వనజకు తెలియజేయడంతో ఆయన గురించి పలుచోట్ల వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో నరేష్ భార్య వనజ పట్టణ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. అతని గురించి ఆచూకీ తెలిసిన వారు 08455 276333 లేదా 8712656718 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

డాక్టర్ నిర్లక్ష్యంతోనే మరణించాడని కుటుంబసభ్యుల ఆందోళన



బొల్లారం రమేశ్(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 : ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందగా, వైద్యుడి నిర్లక్ష్యంతోనే మరణించాడని కుటుంబసభ్యులు ఆందోళన చేసిన సంఘటన సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన బొల్లారం రమేశ్(34) మెడనరాల నొప్పి, ఫిట్స్ సమస్యతో ఈ నెల 8న సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. ఐదు రోజుల పాటు చికిత్స అందించారు. గురువారం ఉదయం 12 గంటలకు హఠాత్తుగా కార్డియాక్ అరెస్ట్ రావడంతో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రమేశ్ చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. చికిత్స అందించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీతో పాటు పలువురు సీఐలు పోలీసు బలగాలతో ఆస్పత్రి వద్దకు చెరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. సుమారు ఆరు గంటల ఆందోళన అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు శాంతించి రమేశ్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు. ఇప్పటివరకు చెల్లించిన బిల్లు కూడా తిరిగి ఇచ్చేశారు. మృతిచెందిన రమేశ్‌కు ఇద్దరు చిన్న పిల్లలున్నారని ఆదుకోవాలని కోరడంతో మానవతా దృక్పథంతో చివరికి రూ.2 లక్షలు నగదును ఆస్పత్రి యాజమాన్యం రమేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ విషయంలో ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

రాజీమార్గమే మేలు

ఈ నెల 28 జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద



మాట్లాడుతున్న మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, సెప్టెంబరు 12: కేసుల పరిష్కారానికి రాజీమార్గమే మేలు అనే నినాదాన్ని ప్రజల్లో నింపాలని మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీశారద పేర్కొన్నారు. సంగారెడ్డి కోర్టు ప్రాంగణంలో గురువారం ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్, బ్యాంక్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ బృందంతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. మెదక్, నర్సాపూర్ కోర్టుల ప్రాంగణంలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్లొచ్చేలోపు చోరీ..


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: ఖేడ్‌ పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం మెదక్ జిల్లా రేగోడు మండలం కొండాపూర్‌కు చెందిన ప్రభాకర్ ఖేడ్‌లోని మైనార్టీ బాలికల గురుకులం వెనుక కాలనీలోని ఓ అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో భోజనాలు చేశాక ఇంటి తలుపులు తెరిచి ఉంచి భార్యతో కలిసి కొంతదూరం వాకింగ్‌కు వెళ్లాడు. తిరిగొచ్చేసరికి భార్యకు చెందిన హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంగ్‌లో 6.5 తులాల బంగారం, 5 తులాల వెండి నగలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి..

- ఇరువురి మృతితో అనాథైన బాలిక
- పుట్టెడు దుఃఖంతో తల్లికి తలకొరివి


అంత్యక్రియల్లో తల్లి మృతదేహం ముందు నడుస్తున్న కూతురు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 : పుట్టెడు దుఖాన్ని దిగమింగుకొని తల్లి చితికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన శ్యామల వారం క్రితం మెదక్‌కు కూలి పనుల కోసం బైకుపై వెళ్తుండగా ఖాజీపల్లి గ్రామ శివారులో మెదక్ చేగుంట రహదారిపై వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. శ్యామలకి తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా... చికిత్సపొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త బాలయ్య ఐదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. ఇరువురి మృతితో కూతురు లక్ష్మి అనాథగా మారింది. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ తల్లి చితికి తలకొరివి పెట్టి ముందుకు సాగింది. కనీసం ఇల్లుకూడా లేని చిన్నారిని దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్య పనులపై పకడ్బందీ చర్యలు

- డీఎల్‌పీవో అనిత


కొన్యాల గ్రామంలో పర్యటిస్తున్న డీఎల్‌పీవో అనిత

హత్నూర, సెప్టెంబరు 12: గ్రామాలలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి డీఎల్‌పీవో అనిత అన్నారు. గురువారం హత్నూర మండలం కొన్యాల గ్రామాన్ని సందర్శించిన ఆమె గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. నిర్వహించారు. గ్రామాలలో తాగునీటి పైపులైన్ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని సూచించారు. దోమల నివారణకు క్రమంతప్పకుండా మందు పిచికారి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో యూసుఫ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

- క్లినిక్ వద్ద ఆందోళన.. నష్టపరిహారానికి ఆర్ఎంపీ అంగీకారం

హత్నూర, సెప్టెంబరు 12: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చింతల్‌చెర్వు గ్రామంలో ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన కంచి గారి ప్రశాంత్ (35)నర్సాపూర్ లోని బైకు షోరూంలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. గ్రామానికి వస్తుండగా అదుపు తప్పి బైకు పై నుంచి పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే వెళ్లి దౌల్తాబాద్‌లో ప్రథమ చికిత్స చేయించి, స్వగ్రామానికి తీసుకువచ్చారు. రాత్రి గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో మిత్రులతో కలిసి పాల్గొన్నాడు. గురువారం ఉదయం కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీకులు చింతల్‌చెర్వులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్లారు. ప్రశాంత్‌ను పరిశీలించిన ఆర్ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ చేసినట్లు తోటి మిత్రుల ద్వారా తెలిసింది. కొద్దిసేపటి తర్వాత అతడి పరిస్థితి మరింత విషమించడంతో అక్కడి వారంతా ఆర్ఎంపీ వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ప్రశాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి మృతదేహన్ని చింతల్‌చెర్వులోని ప్రైవేట్ క్లినిక్ వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం వల్లే ప్రశాంత్ మృతి చెందాడని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో కొందరు స్థానికులు జోక్యం చేసుకొని మృతుడి కుటుంబానికి రూ.4లక్షలు ఇచ్చేందుకు ఒప్పించారు. దీంతో శాంతించిన స్థానికులు మృతదేహన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ విషయమై హత్నూర ఎస్ఐ సుభాష్‌ను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ క్లినిక్‌ను గత కొన్ని నెలల క్రితం జిల్లా వైద్యధికారులు సీజ్ చేశారు.

తెగుళ్ల తంటా.. కన్నీళ్లు కంట


తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో దెబ్బతిన్న టమాటా పంట

- వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటలు
- తెగుళ్లతో నల్లబారుతున్న కాయలు
- ఆందోళనలో అన్నదాతలు

ఝరాసంగం/తొగుట, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన వర్షాలతో టమాటా పంటలకు తెగుళ్లు సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టామాటాలు నల్లబారి రంధ్రాలు పడుతుండడంతో మార్కెట్‌కు తరలించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో చాలామంది రైతులు టామాటాలను పొలంలోనే వదిలేస్తున్నారు. ఒక వేళ విక్రయానికి తరలించినా ధర పలకకపోవడంతో కూలీల డబ్బులు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఝరాసంగం మండలంలోని మాచూనూర్, క్రిష్టాపూర్, బర్దీపూర్, కుప్పానగర్ తదితర గ్రామాల్లో టమాటా పంటలను సాగు చేశారు. అలాగే దుబ్బాక సబ్ డివిజన్ పరిధిలోని అక్బర్‌పేట - భూంపల్లి, దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, రాయపోల్ మండలాల్లో 141.36 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కాగా, తొగుట మండలంలో వంద ఎకరాల్లో కూరగాయల పంటలు సాగైతే.. అధికారులు మాత్రం పంటల నమోదులో కేవలం 6.2 ఎకరాలుగానే నమోదు చేశారు. దీంతో చాలామంది నష్టపోయిన రైతులకు పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది.

ఎకరానికి రూ.15 వేల ఖర్చు..

టామాటా పంట సాగుకు ఎకరానికి రూ.10వేల నుంచి 15 వేల చొప్పున పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. వేసవిలో టమాటా సాగు అధికంగా ఉండడం వల్ల ధర లేక నష్టం వాటిల్లితే.. ప్రస్తుతం మార్కెట్‌లో 20 కిలోల పెట్టెకు రూ.300-500 పలుకుతున్నా.. వర్షాలతో టామాటాలు నల్లబడి ధర పలకడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

వర్షాల నేపథ్యంలో టమాటా పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనాలు ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు పంటల వద్దకు రాలేదని, దీంతో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పంటలను సందర్శించి తగు జాగ్రత్తలు వివరించాలని కోరుతున్నారు.


ఝరాసంగం : తెగులు సోకడంతో టమాటా పంటను పొలంలో వదిలేసిన రైతులు

పొలంలోనే వదిలేశా..



విస్తారంగా వర్షాలు కురవడంతో టమాటా పంటలకు తెగుళ్లు రావడంతో కాయలు నల్లాబారుతున్నాయి. వాటిని మార్కెట్‌కు తరలిస్తే ధర పలకడం లేదు. కూలీల డబ్బులు కూడా రావడం లేదు. దీంతో పంటను పొలంలోనే వదిలేశా. అప్పుడు మార్కెట్‌లో ధర లేక, ఇప్పుడు వర్షాల వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లింది.

-అశోక్ , రైతు

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..



మల్లన్నసాగర్‌లో తనకున్న భూమి ముంపునకు గురైతే గ్రామంలో ఒక ఎకరా పదిగుంటల భూమిని కౌలుకు తీసుకుని టమాట పంట సాగుచేశాను. రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికందే దశలో వర్షానికి మొత్తం దెబ్బతిన్నది. కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం తమకు న్యాయం చేసి నష్టపరిహారం అందజేయాలి.

- ఉప్పలయ, కౌలురైతు, తుక్కాపూర్

పంటలు నమోదు చేసుకుంటేనే పరిహారం

రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల వద్ద పంటల నమోదు చేసుకోవాలి. తొగుట మండలంలో 6.2 ఎకరాల్లో కూరగాయల పంటల సాగైనట్లు రికార్డుల్లో నమోదైంది. నష్టపరిహారం అందాలంటే పంటల వివరాలను నమోదు చేసుకుని ఉండాలి. క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- రమేశ్, దుబ్బాక డివిజన్ హార్టికల్చర్ అధికారి

దండం పెడతాం.. డంపు యార్డు వద్దు

- ఇప్పటికే రోగాల బారిన పడుతున్నాం..
- కంపెనీల కాలుష్యంతోనే ఊపిరాడడం లేదు
- కలెక్టర్ వల్లూరు క్రాంతితో గుండ్లమాచూనూర్‌వాసుల మొర

హత్నూర, సెప్టెంబరు 12: కంపెనీల కాలుష్యంతో ఊపిరాడటం లేదు. వయసుతో సంబంధం లేకుండా రోగాల బారిన పడుతున్నాం. ఇక డంపు యార్డు ఏర్పాటు చేస్తే ఇక్కడ బతకడం కష్టం అంటూ గుండ్లమాచునూర్ గ్రామస్థులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలోని మోడల్ స్కూల్‌తోపాటు ఆ గ్రామ శివారులో డంపు యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న గుండ్లమాచునూర్‌వాసులు అక్కడకు చేరుకొని కాళ్లు మొక్కుతాం మేడం.. ఇక్కడ డంపుయార్డు వద్దంటూ అంటూ వేడుకున్నారు. ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, 60 సంవత్సరాల పైబడి ఎవరు బతకడం లేదంటూ విన్నవించారు. ఈ స్థలంలో పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. దీనిపై విచారణ చేస్తామని కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ చౌహన్, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీఈవో యూసుఫ్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు ఉన్నారు. మోడల్ స్కూల్‌ను పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేసి ఉన్నత్తులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు.


డంపుయార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


వెంకటేష్(ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన రూపుల వెంకటేష్ (37) నాలుగు రోజుల క్రితం శాలిపేట గ్రామ నల్ల చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చిక్కుకొని నీట మునిగి మృతి చెందాడు. రాత్రి అయినా వెంకటేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన స్థానికులకు చెరువులో శవం తేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికి తీసి శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రామాయంపేట మార్చురీకి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జిల్లా ఆసుపత్రి నుంచి బాలిక అదృశ్యం


ప్రణీత (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12 : బంధువులను చూడటానికి జిల్లా ఆసుపత్రికి వచ్చిన మతిస్థిమితం సరిగ్గా లేని ఓ బాలిక కనిపించకుండా పోయిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.బాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం పట్టణంలోని రైల్వేకట్టకు చెందిన రాజు భార్య సుశీల కూతురు ప్రణీత (14) ఈ నెల 10న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి బంధువును చూడటానికి వచ్చారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత ప్రణీత చేతులు కడుక్కోవడానికి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు.

వైభవంగా మూలమహోత్సవం

వర్గల్, సెప్టెంబరు 12 : వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లక్ష పుష్పరచ, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు


యూత్ పార్లమెంట్ కాంపిటీషన్‌లో విద్యార్థులు

ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్ కాంపిటీషన్

- ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్, సెప్టెంబరు 12 : మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం నిర్వహించిన 26వ రీజినల్ లేవల్ యూత్ పార్లమెంట్ కాంపిటీషన్ ఆకట్టుకున్నది. స్పీకర్, మంత్రుల పరిచయాలు తర్వాత ప్రభుత్వం, ప్రతి పక్షంలో ప్రదర్శించిన విద్యార్థులు సమస్యలు, వాటి పరిష్కరంపై నిజమైన లోక్ సభ ఎలా ఉంటుందో అలానే వాదనలు చేశారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ కాంపిటీషన్‌లో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, విశిష్ట అతిథిగా నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి హాజరయ్యారు. ముందుగా నవోదయ విద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు చూస్తుంటే నిజమైన పార్లమెంట్‌లో లోక్‌సభను చూసినట్లు ఉందన్నారు.

సీజ్‌చేసిన వాహనాలు తీసుకెళ్లండి

- ఎస్పీ చెన్నూరి రమేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో సీజ్‌చేసిన 269 ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు తగు ధ్రువపత్రాలు చూపించి తీసుకెళ్లాలని, లేకపోతే వాటిని వేలం వేస్తామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. వాహన యజమానులను గుర్తించేందుకు ప్రయత్నించగా సరైన చిరునామాలు లభించడం లేదన్నారు. వాహనాల వివరాలను సంగారెడ్డి జిల్లా పోలీసు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. యజమానులు సంబంధిత పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఆరు నెలల్లో వాహనాలు తీసుకోవాలని, లేకుంటే వేలం వేస్తామని తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


గంగాబాయి(ఫైల్)

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో సార గంగాబాయి జైస్వాల్(110) అనే శతాధిక వృద్ధురాలు గురువారం మృతి చెందింది. గంగాబాయికి మనవళ్లు, మునిమనవళ్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

దిగివచ్చిన ఎపిటోరియా యాజమాన్యం

- కార్మికులతో చర్చలు సఫలం.. ఆందోళన విరమణ


కార్మికులతో మాట్లాడుతున్న పరిశ్రమ ప్రతినిధులు

హత్నూర, సెప్టెంబరు 12: సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులుగా హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా యూనిట్-1 పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్నారు. కాగా, గురువారం సాయంత్రం పరిశ్రమ ప్రతినిధులు చర్చలు జరిపి హామీల అమలుకు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు ఆందోళనను విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం తమ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే తిరిగి ఆందోళన చేపడుతామని కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు.

నిమజ్జనం కారాదు విషాదం

వినాయకుడి శోభాయాత్రలో జాగ్రత్తలు తప్పనిసరి



మెదక్ కల్చరల్, సెప్టెంబరు 12: వినాయక చవితి వచ్చిందంటే చాలు యువత హడావిడి, హంగామా అంతాఇంతాకాదు. ఇక నిమజ్జన ఘట్టాన్ని అయితే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ తరుణంలో ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్లే. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు. వేడుకల కన్నా భద్రత ముఖ్యం అనే విషయాన్ని నిమజ్జనంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ముఖ్యంగా వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లాలి. ఊరేగింపు ఏమార్గంలో వెళ్లాలి అనే విషయాన్ని ముందుగానే ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ధారించుకోవాలి. ఆ దారిలో విద్యుత్ వైర్లు తగలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. రంగులు చల్లుకుంటున్నప్పుడు కళ్లలో పడకుండా చూసుకోవాలి. లేదంటే అవి రసాయానిక రంగులు కావడంతో కంటి సమస్యలు వచ్చే ప్రమాదమున్నది. ఊరేగింపు మార్గదర్శక బాధ్యతలు కనీసం ఇద్దరు వ్యక్తులకు అప్పగించాలి. అందులో ఒకరు రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రణ చేస్తుంటే.. మరొకరు శోభాయాత్ర సరైన దారిలో జరుగుతుందా లేదా అనే విషయాన్ని పర్యవేక్షిస్తుండాలి. ఊరేగింపు జరిగేటప్పుడు రెండు వైపులా తాళ్లు పట్టుకొని కనీసం నాలుగు మంది వరుస క్రమంలో ఉండటం ఇంకా మంచిది. ఇలా చేయడం వలన వాహనాల రాకపోకలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. ఊరేగింపులో పిల్లల చేయి వదలకుండా తల్లీదండ్రులు వెంటనే ఉంచుకోవాలి. అతిగా శబ్ద కాలుష్యం లేకుండా గణేషుడి శోభాయాత్ర నిర్వహించాలి.

బాణాసంచాలతో జాగ్రత్త...

ఊరేగింపులో చాల మంది ఉత్సాహంగా బాణాసంచాలు కాలుస్తుంటారు. ఉత్సాహంలో కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఎక్కడపడితే అక్కడ పటాకుల మోత మోగిస్తుంటారు. పటాకులు కాల్చేటప్పుడు దారిలో ఎవరైనా వస్తున్నారా.. లేదా అని చూసుకోవాలి. దూరంగా ఉండి వాటికి నిప్పు పెట్టాలి. నిమజ్జనం అంటేనే జనం రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి వీలైనంత వరకు పటాకులు కాల్చకపోవడం మంచిదని నిర్వాహకులు గుర్తించాలి.

ఇవి అందుబాటులో ఉంచుకోవాలి...

నిమజ్జనంలో అత్యవసర వస్తువులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలి. నీరసం కోల్పోకుండా తరుచూ తీసుకునేందకు నీరు, ఆహారం ఉండేలా చూసుకోవాలి. చిన్న చిన్న గాయాలు అయ్యినప్పుడు వెంటనే చికిత్స తీసుకునేందుకు ప్రథమ చికిత్స కిట్‌ను వెంట ఉంచుకోవాలి. అవసరమైతే ఈ బాధ్యతను ఒకరికి అప్పగించి ఊరేగింపు ముగించేవరకు తోడుండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు సైతం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలి. అత్యవసరమైతే ఆసుపత్రులకు పంపించేందుకు వీలుగా అంబులెన్సుల సౌకర్యాన్ని కల్పించాలి. అధిక రక్త పోటు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు వహించాలి. శబ్దం ఎక్కువగా ఉంటే రక్తపోటు పెరిగే అవకాశం ఉన్నందునా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

చెరువులు, ప్రాజెక్టుల వద్ద జర జాగ్రత్త..

నిమజ్జనం సమయంలో చెరువు వద్ద ఏ మాత్రం ఆద మరిచినా ప్రాణపాయం తప్పదు. ఈతరాని వారు నీటికి దూరంగా ఉండాలి. నీటిలోకి దూకడం లాంటివి అస్సలు చేయకూడదు. ముఖ్యంగా చెరువు లోతు అంచనా వేస్తూ ముందుకెళ్లాలి. చెరువుల వద్దకు చిన్నారులకు తీసుకోకపోవడం ఉత్తమం. విగ్రహాలు పెద్దవి అయితే దానికోసం క్రేన్‌లు, పడవలు వాడటం మంచిది. నిమజ్జన జరిగే స్థలంలో గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలి.

రెయిలింగ్‌ను ఢీకొట్టిన ప్రైవేటుబస్సు

- తృటిలో తప్పిన ప్రమాదం

జహీరాబాద్,సెప్టెంబరు 12: ఓ ప్రైవేటు బస్సు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్లితే పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన డ్రైవర్ రాజు ప్రైవేటు బస్సును నడుపుతున్నాడు. రోజు మాదిరాగానే దిగ్వాల్ గ్రామంలోని పిరమాల్ కర్మాగారంలో కార్మికులను తీసుకెళ్లడానికి గురువారం మధ్యాహ్నం తాండూర్‌కు వెళ్లే రోడ్డుగుండా రాంనగర్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్నాడు. బ్రిడ్జిపైకి బస్సుతో కొద్దిదూరం రాగానే ఓ వ్యక్తి బైకుపై ఫోన్ మాట్లాడుతూ బస్సుకు ఎదురుగా వచ్చాడు. అతడిని తప్పించబోయే క్రమంలో బస్సుతో బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో డ్రైవర్ రాజుకు తృటిలో ప్రమాదం తప్పింది



'కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలి'


కార్గో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ పవన్

కుకునూరుపల్లి, సెప్టెంబరు 12: కుకునూరుపల్లి మండల ప్రజలు కార్గో సేవలను వినియోగించుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ కోరారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఆర్టీసీ కార్గో కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ ద్వారా వేగంగా, భద్రత ప్రమాణాలతో తక్కువ ధరకే కార్గో సేవలను ప్రజలకు అందిస్తున్నామని, కుకునూరుపల్లిలో ఇప్పటి వరకు కార్గో కేంద్రం లేకపోవడంతో ఇటు గజ్వేల్, అటు సిద్దిపేటకు వెళ్లేవారని కానీ ఇప్పుడు మండల కేంద్రంలోని కార్గో కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సందీప్, షఫీ, పాషా, భాస్కర్, అరవింద్, శంకర్, స్వామి, రాజు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి చేయూత

- సోనాలీ కోళ్ల పెంపకాని ప్రణాళిక సిద్ధం
- పాడిగేదెకు రూ.93 వేల చేయూత

మద్దూరు, సెప్టెంబరు 12: మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధికి ప్రభుత్వం చేయూతనందించేందుకు పక్కాప్రణాళికతో ముందడుగు వేస్తున్నది. అందులో భాగంగానే మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాడితో పాటు దేశీయతను పోలిన సోనాలీ కోళ్ల పెంపకానికి ఆర్థిక చేయూతనందిస్తూ అండగా నిలువనుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జాగృతి మహిళా సమాఖ్య అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ సంఘాల సీఏలకు ఉపాధి కల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మండల జాగృతి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 115 సంఘాలున్నాయి. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.12,21,73,000 కోట్ల రుణాల్ని అందించినట్లు సమాఖ్య మండల కమిటీ తెలిపింది.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం జాగృతి సమాఖ్య ఆధ్వర్యంలో సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు జీవనోపాధికి కల్పిస్తున్న ఉపాధి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. క్రమంతప్పక రుణాల్ని చెల్లించాలి.

-బాబురావు ఏపీఎం మద్దూరు

సోనాలీ కోళ్లతో అధిక ఆదాయం

దేశంలో ఉన్న వందలాది జాతి కోళ్లలో దేశీయతను కలిగిన సోనాలీ కోళ్ల జాతి ఒకటిగా ఉంది. దాణా ఖర్చు తక్కువ ఎదుగుదల ఎక్కువగా ఉండి మార్కెట్లో ధర బాగా ఉండడంతో పాటు అధిక డిమాండ్‌ను కలిగి ఉన్నాయి. పర్యావరణ పరిస్థితులను తట్టుకునే లక్షణాలున్నాయి. ఒక్కో కోడి పిల్లకు రూ.35లు పలుకుతుండగా మదర్ యూనిట్ ఆధ్వర్యంలో పెంపకం చేపట్టి 6 నుంచి 8 వారాలు పెంచి లబ్ధిదారులకు రూ.140 చొప్పున అందిస్తారు. ఇవి పెరిగి పెద్ద కావడానికి 120 నుంచి 130 రోజుల సమయం పడుతుంది. వీటి మేతకు కిలో రూ.35 నుంచి 40 ఖర్చు అవుతుంది. మార్కెట్లో కిలో రూ. 300 పైనే ధర పలుకుతుంది. 50 పిల్లలపై పెంచుకునే లబ్ధిదారులలు రూ.15 వేల మెంటెనెన్స్‌కు రుణం అందిస్తారు.


మద్దూరులో జాగృతి సమాఖ్య అధ్వర్యంలో సీసీలకు ఉపాధి అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

172 మంది పాడి లబ్ధిదారుల ఎంపిక

పాడితో ఉపాధి కల్పించేందుకు 172 మందిని ఎంపిక చేశారు. శ్రీనిధి లేదా బ్యాంకు లింకేజీ నుంచి గానీ వివో నుంచి గానీ రూ.93 వేల రుణ సహాయాన్ని అందిస్తారు. రాష్ట్రం నుంచి గాకుండా ఇతర రాష్ట్రాలను నుంచి ఆవును గానీ గేదెను గానీ లబ్ధిదారులు ఇష్ట ప్రకారంగానే కొనుగోలు చేసే వీలు కల్పించారు. వీటికి ఇన్స్‌రెన్సూ కల్పిస్తారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ కోసం ఎదురుచూస్తున్నారు. మొదటి విడతగా రెండు గ్రూపులను ఎంపిక చేసినట్లు జాగృతి మండల సమాఖ్య తెలిపింది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, సెప్టెంబరు 12: పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లి శివారులోని ఓ భవనంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5100 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంగుపల్లికి చెందిన కుమార్, మల్లేష్, రమేష్, ముత్యాలు, ప్రశాంత్‌లపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

రాహుల్‌గాంధీ దేశద్రోహి

- బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కోడూరు నరేష్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 12: రాహుల్‌గాంధీ దేశద్రోహి అని, ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కోడూరు నరేష్ ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలో గురువారం బీజేపీ నాయకులతో కలిసి రాహుల్‌గాంధీ ఫ్లెక్సీని దహనం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ భారత వ్యతిరేక శక్తులతో విదేశాల్లో సమావేశాలు నిర్వహిస్తూ, దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొమ్మగాని పద్మ, అర్బన్ మండల అధ్యక్షుడు వరప్రసాద్, బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బాసం గారి వెంకట్, పట్టణ ప్రధానకార్యదర్శులు పిట్ల నరేష్, బొడ్డు సునీల్, కమ్మసారం సంతోష్, ఓబీసీ మోర్చా నాయకుడు భోగి శ్రీనివాస్, పట్టణ అధికార ప్రతినిధి మెరుగెల్లం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు12: అధైర్య పడకండి అండగా ఉంటానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పలువురు మృతుల కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. సిద్దిపేట పట్టణంలోని పలువురు మృతుల కుటుంబసభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది వంగ హన్మంతరెడ్డి తల్లి రాజవ్వ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని, పట్టణంలోని వీరబత్తిని జనార్దన్ తండ్రి వీరబత్తిని భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను, పట్టణంలోని ఓ చర్చి పాస్టర్ మత్తయి భార్య సువార్త అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తదితరులు ఉన్నారు.

- **సిద్దిపేట రూరల్:** సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెళ్లి గ్రామంలో ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందిన కోటగిరి మహేష్ గౌడ్ కుటుంబాన్ని గురువారం మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. మహేష్ చిన్న వయస్సులోనే మరణించడం చాలా బాధకరమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనవెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నారా గౌడ్, మాజీ సర్పంచ్ కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


సిద్దిపేట టౌన్: పట్టణంలోని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

చదువుతోపాటు క్రీడలూ అవసరమే

- జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 12: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి పాఠశాలల ఆటల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కొత్త రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, మండల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఎర్ర అశోక్, పీఈటీలు శ్రీశైలం, సుశీల, వెంకటస్వామి, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, వేణు, సాగర్, లీలా, ఆనంద్, రాజు పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతో తలరాతనే మార్చుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సులభశైలిలో అందమైన చేతిరాత నేర్చుకునే నోట్‌పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. చేతిరాత పుస్తకాల దాతలు ఎర్రవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పన్యాల శ్రీనివాస్‌రెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు, చేతిరాత నిపుణుడు గడ్డం యాదగిరి, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

- **కొండపాక:** పాఠశాల స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ దిలీప్‌నాయక్, ఎంఈవో శ్రీనివాసరెడ్డి సూచించారు. కొండపాకలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో విఠల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రామచంద్రం, పీడీ భాస్కర్‌రెడ్డి, ఉప్పలయ్య, శుభాకర్‌రెడ్డి, బాబు, రాధిక, పద్మ ఎంఐఎస్ సురేందర్, సీఆర్పీ బాలకిషన్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో డీఈవో శ్రీనివాసరెడ్డి


కొండపాక : పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

- **కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 15 బాలుర హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. హనుమకొండలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు కుకునూరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు హాజరు కాగా 20 మంది క్రీడాకారులు అర్హత సాధించి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హాండ్‌బాల్ ప్రధాన కార్యదర్శి దామోదర మల్లేశం, ప్రధానోపాధ్యాయులు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి హేయనీయం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 12: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దాడికి పాల్పడటం సిగ్గుచేటని, ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై ఆయన గురువారం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన అరికెపూడి గాంధీ రాజకీయ నైతిక విలువలు తుంగలో తొక్కి కాంగ్రెస్‌కు వంతపాడటం తగదన్నారు. అరికెపూడి గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పడంతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

- **హుస్నాబాద్:** హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటితో పాటు తెలంగాణ భవన్‌పై ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ అనుచరులు దాడులు చేయడం పిరికిపందల చర్య అని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతి భద్రతలు ఉన్నట్లా, లేనట్లా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ విషయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం అనైతికమన్నారు. దాడుల సంస్కృతిని రూపుమాపాలని, లేనట్లయితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'హైడ్రా' పేరుతో ప్రభుత్వం హైడ్రామా

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, సెప్టెంబరు12: సమస్యలను గాలికి వదిలేసి, రైతు రుణమాఫీ అంశం నుంచి రైతులను, ప్రజలను దృష్టిమళ్లించడానికే ప్రభుత్వం 'హైడ్రా' పేరుతో డ్రామా ఆడుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. చిత్తశుద్ధితో చెరువులను పునరుద్ధరిస్తే స్వాగతిస్తామని, కానీ హైడ్రా పేరుతో నాటకాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. దుబ్బాకలో 250 మందికి రూ. 90లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పింపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను పూర్తిగా వంచించి, రాజకీయ పబ్బం గడుపుతున్నారన్నారు. పల్లెల్లో ఆరోగ్యం పడకేసిందని, డెంగీ, మలేరియా వ్యాధులతో ప్రజలు తల్లడిల్లుతున్నారన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత కత్తికార్తీకాగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు

చేర్యాల, సెప్టెంబరు 12: కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం పలు బెల్టుషాపులపై దాడులు చేసినట్లు ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు. ఈమేరకు నిర్వాహకులు వల్లపు వెంకటేశ్, మాదాసు రమేశ్ దుకాణాల్లో సోదాలు చేసి మద్యం సీజ్ చేశామని, ఇరువురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

'ప్రభుత్వమే సంక్షేమ పథకాలందివ్వాలి'

కొండపాక , సెప్టెంబరు 12: తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద,సహజ మరణ,శాశ్వత, పాక్షిక అంగవైకల్యం సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన చొప్పరి రవికుమార్, సిఐటియు మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్యలు డిమాండ్ చేశారు. గురువారం కొండపాక మండలం వెలికట్టలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించి నిదులను దారి మళ్ళించకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చుచేయాలన్నారు.ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందివ్వాలని కోరుతూ 18న జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎల్‌వోసీ అందజేత

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు12: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన ఆర్ భగవాన్ అనే వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దృష్టికి రాగా గురువారం బాధితుడికి రూ. 2.50 లక్షల ఎల్‌వోసిని అందజేశారు. ఆయనవెంట నాయకులు ముద్దం లక్ష్మి, రాములు, మంద పాండు, చెంది శ్రీనివాస్, నాంపల్లి శేఖర్, మహిళా నాయకులు వనజ, సంతోషి, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 14న శౌర్యయాత్ర

చేర్యాల: సాయుధ పోరాట యోధులను స్మరిస్తూ సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14న శౌర్యయాత్ర చేపట్టనున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు తప్పనిసరి: ఎంఈవో ప్రభుదాస్

మిరుదొడ్డి,సెప్టెంబరు12: ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ అనుమతిని తప్పనిసరని మండల విద్యాధికారి ప్రభుదాస్ సూచించారు. మిరుదొడ్డిలోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల కొనసాగుతుందని విద్యార్థి సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకు వచ్చారని, అందులో భాగంగానే పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలను నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

అక్రమ వెంచర్ హద్దురాళ్ల తొలగింపు


హద్దురాళ్లను తొలగిస్తున్న సుడా సిబ్బంది

సిద్దిపేట అర్బన్,సెప్టెంబరు 12: సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్ పల్లి, పొన్నాల గ్రామాల్లో అక్రమ వెంచర్ హద్దురాలను తొలగించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్ తెలిపారు. సుడా వైస్ చైర్మన్ అశ్రుత్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం రెండు గ్రామాల్లో ఉన్న అక్రమ వెంచర్ హద్దురాలను తొలగించినట్లు వెల్లడించారు. సుడా పరిధిలో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు.

చేర్యాలలో సామూహిక కుంకుమార్చన

చేర్యాల, సెప్టెంబరు 12 : గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని గడిమైసమ్మవీధిలో మైసమ్మ యూత్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గణపతిని, అమ్మవారిని స్తుతిస్తూ కుంకుమార్చన జరిపి తమ కష్టాలు తీర్చాలని వేడుకున్నారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే వైశ్యభవన్‌లో వినాయకుడికి విశేష మంగళహారతుల కార్యక్రమం నిర్వహించి నీరాజనం పలికారు.

చెరువు మత్తడికి బుంగ

కొండపాక, సెప్టెంబరు 12: కొండపాక శివారులోని పోతారెడ్డి చెరువు మత్తడికి బుంగ పడింది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరింది. దాదాపు మత్తడి వరకు నీరు రావడంతో మత్తడి కింది భాగంలో రెండు మూడు చోట్ల బుంగ ఏర్పడడంతో నీరు వృథాగా పోతున్నది. మత్తడి లీకేజీని పూడ్చకుంటే నీరు అంతా వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మరమ్మతు చేపట్టాలని కోరుకున్నారు.


వృథాగా పోతున్న నీరు

కోతిని కాపాడిన గ్రామస్థులు


కోతిని బంధిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొండపాక, సెప్టెంబరు 12: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన కోతిని మండలంలోని సిరసనగండ్ల గ్రామస్థులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పగించిన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. గ్రామ బస్టాప్ వద్ద కోతులు విద్యుత్ వైర్ నుంచి వెళ్లడంతో ఒక కోతి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని గ్రామస్థులు గమనించి కోతిని ఒకచోట ఉంచి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బీట్ అధికారి సురేష్ చేరుకుని కోతిని తేజోవనం అర్బన్ పార్క్‌కు తరలించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై విచారణ

కొండపాక, సెప్టెంబరు 12: ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని అధికారులు గురువారం ఫీల్డ్ ఎంక్వయిరీ చేశారు. మండలంలోని వెలికట్ట శివారులోని పలువురికి చెందిన ప్లాట్లను పరిశీలించారు. నారాయణరావుపేట ఎంపీవో శ్రీనివాస్, ఆర్ఐ బాలకృష్ణ, ఐబీఏఈ భాగ్యలక్ష్మి తదితరులు విచారణ చేశారు.

వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 12: భారీ వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చిన వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. ఇటీవల జిల్లాలో భారీ వర్షాలు కురిసి తీవ్రమైన పంటల నష్టం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు నిండి కొన్ని చోట్ల వాటికి గండ్లు పడ్డాయన్నారు. రోడ్లన్నీ తెగిపోవడం మూలంగా అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందించాలని, నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, దయానందరెడ్డి, వనేష్, అశోక్, లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బన్సీలాల్, భాస్కర్, శివలింగు కృష్ణ, ఈరి భూమయ్య మల్లేశం, చంద్రం, నర్సింహారెడ్డి,మంద శ్రీనివాస్, జేరిపోతుల జనార్దన్, సంగెం మధు, రామగాళ్ల నరేష్, మిట్టపల్లి సుధాకర్, మహిళా సమాఖ్య నాయకులు యాద పద్మ, రజిని, జంగ విజయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఏచూరి మరణం ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటు

- సీపీఎం నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 12: ఏచూరి మరణం కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. పార్టీ గజ్వేల్ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏచూరి విద్యార్థి ఉద్యమం ఎస్ఎఫ్ఐ నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారన్నారు. రాజ్యసభకు రెండు దఫాలుగా ఎన్నిక అయ్యారని, భారత పార్లమెంటు బృందానికి నాయకత్వం వహించి ఐక్యరాజ్యసమితిలో మూడుసార్లు ప్రసంగించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటాచారి, అఫ్జల్, సమీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

- **సిద్దిపేట అర్బన్:** సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శశిధర్, జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించి, ఏచూరి ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



చేర్యాల: ఏచూరి ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, తదితరులు

- **చేర్యాల:** సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతి పట్ల గురువారం చేర్యాల, కొమురవెల్లి మండాలాల్లో సీపీఎం నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు కొంగరి వెంకట్‌మావో, శెట్టిపల్లి సత్తిరెడ్డి, రాళ్లబండి నాగరాజు ఏచూరి మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. ఏచూరి మరణం కలిచివేసిందని, విద్యార్థి ఉద్యమాలకు స్ఫూర్తి చిన్నిన ఏచూరికి ఆకర్షితుడనై తాను వామపక్ష భావజాలానికిలోనయ్యానని పేర్కొన్నారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి

తొగుట, సెప్టెంబరు12: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేయడానికి ప్రజలు స్వచ్ఛందంగా బీజేపి సభ్యత్వం తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్, నాయకులు స్వామిరెడ్డి, నరసింహులు, చంద్రశేఖర్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రవీణ్, కర్ణాకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



నారాయణరావుపేట మండలం మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు. విద్యార్థులందరికీ స్వీట్లు, తీర్థ ప్రసాదాలను పంచారు. నిమజ్జనం కోసం ఎడ్లబండిని అలంకరించి గణపతిని వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు శివపార్వతుల వేషధారణ కట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- సిద్దిపేట రూరల్

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- ఎంపీ రఘునందన్‌రావుకు ఉద్యోగుల వినతి

వర్గల్, సెప్టెంబరు 12: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయ్యాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయ్యాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురువారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, బేసిక్ పే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగుల వినతికి స్పందించిన ఎంపీ కేంద్రమంత్రి, రాష్ట్ర సీఎంకు ఉత్తరం రాస్తానన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేణుక


రేణుకకు నియామకపత్రాన్ని అందజేస్తున్న నర్సారెడ్డి

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు12: కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా తౌడబోయిన రేణుకను నియమిస్తూ నియామకపత్రాన్ని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి గురువారం అందజేశారు. తనై నమ్మకతో జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చినందుకు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు గయాసుద్దీన్, తప్పట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

గజ్వేల్, సెప్టెంబరు 12: గజ్వేల్ పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువును మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, గజ్వేల్ సీఐ సైదా, కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. గణపతి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వారివెంట వైస్‌చైర్మన్ జకియోద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, గంగిశెట్టి చందన రవీందర్, బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ మారుతీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, వార్డ్ సభ్యులు, నాయకులు, సిబ్బంది తదితరులున్నారు.

- **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత గురువారం పరిశీలించారు. గణేశ్ నిమజ్జనం జరిగే ఎల్లమ్మ చెరువు ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. ఆమెవెంట కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు పున్నసది, వల్లపు రాజు తదితరులున్నారు.
- **హుస్నాబాద్ టౌన్:** వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పిలుపునిచ్చారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిమజ్జన కార్యక్రమంలో డీజేలు వినియోగించకూడదన్నారు.

దుబ్బాకలో అమరవీరుల సంస్మరణ సభ

దుబ్బాక,సెప్టెంబరు 12: నిజాం పాలనకు చరమగీతం పాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆవాజ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అబ్బాస్ కొనియాడారు. దుబ్బాకలోని ఆర్యవైశ్యభవన్‌లో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రైతాంగసాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి గోపాలస్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నవీనా, నాయకులు సాజిద్, చంద్రారెడ్డి, భాస్కర్, ప్రశాంత్, మహేష్, బాగ్యలక్ష్మి, మంజుల, భారతి, రాజు, ప్రభాకర్ తదితరులున్నారు.

'పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం'

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 12: అంగన్వాడీ కేంద్రంలో ఉండే పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని ఎసీడీపీవో ఛాయాదేవి అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మధిర గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, డాక్టర్ సునంద, శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా శ్రావణి, ఆశా వర్కర్ సంతోష, ప్రైమరీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కల్యాణి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, రక్షణ, సంరక్షణపై అవగాహన

చిన్నకోడూరు, సెప్టెంబరు 12: చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణ, సంరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ కనక రాజు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

- **సిద్దిపేట కల్చరల్:** సిద్దిపేట డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మామిడాల శ్రీనివాస్ సూచించారు. ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న టెలిమానస్‌లో భాగంగా స్టూడెంట్ కౌన్సిలర్ కనకచంద్రం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సత్యనారయణరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం మామిడాల శ్రీనివాస్‌ను సన్మానించారు.



వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి చేర్యాల పట్టణంలోని వైశ్య భవన్‌లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శివలింగాకృతిలో ప్రమిదలను అమర్చి జ్యోతులను వెలిగించారు.

- చేర్యాల